

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



సోమవారం 02-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :135 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

సామాన్యుడికి ఊరట.. బియ్యం ధరలకు కళ్లెం!



బీపీటీ బియ్యం కిలో రూ.66

తెలంగాణ సోనా రూ.74

హెచ్ఎంటీ బియ్యం రూ.79

దుకాణాల్లో ధరల బ్యానర్లు తప్పనిసరి

ఎంఆర్పీ దాటితే చర్యలు

ధరల అమలుపై అధికారుల పర్యవేక్షణ

వ్యాపారుల సహకారానికి విజ్ఞప్తి

2 లో

మోడీ గెలుపు అక్రమమే రాహుల్ గాంధీ!

రాంలీలా మైదానంలో ఇండియా కూటమి ర్యాలీ

13.5 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ

2024 ఎన్నికలు అక్రమమని విమర్శ

ఈవీఎంల ట్యాంపరింగ్‌పై ఆరోపణలు

ఓటర్ల జాబితాల్లో అక్రమాలంటూ ధ్వజం

జ్ఞానేష్ కుమార్‌పై రాహుల్ ఫైర్

పదవి నుంచి తప్పుకున్నాక మోడీ పని పడతాం

రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం



2 లో

న్యూస్ డెస్క్, 01 నవంబర్ (ఇది కద నిజం): కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలితో పాటు ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగిన 'ఇండియా' కూటమి మెగా ర్యాలీలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై నిప్పులు చెరిగారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం దేశవ్యాప్తంగా దాదాపు 15 శాతం మంది ఓటర్లను (సుమారు 13.5 కోట్ల మందిని) ఓటర్ల జాబితా నుంచి అక్రమంగా తొలగించారని ఆయన ఆరోపించారు.దీని అర్థం 2024 లోక్‌సభ ఎన్నికలు పూర్తిగా చట్టవిరుద్ధంగా, దొంగిలించిన ప్రజా తీర్పుతో (స్టిలెన్ ఎలక్షన్) జరిగాయని తేటతెల్లమవుతోందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

ఓటింగ్ ముగిసింది.. ఫలితాలపై ఉత్కంఠ!

ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్

ఉదయం వేళల్లో ఓటర్ల ఉత్సాహం

మధ్యాహ్నానికి తగ్గిన పోలింగ్ వేగం

పులివెందులలో చెదురుమదురు వివాదాలు

గూడూరులో అత్యధికంగా 73.96 శాతం పోలింగ్

జీవీఎంసీలో అత్యల్పంగా 39.72 శాతం నమోదు

స్ట్రాంగ్‌రూమ్‌లకు బ్యాలెట్ బాక్సుల తరలింపు

నవంబర్ 3న ఓట్ల లెక్కింపు

2 లో

"మీరు అక్కడే ప్రధానిగా ఉండండి"

రాహుల్‌పై అమిత్ షా విమర్శలు

సిక్కుల అల్లర్ల రోజే ర్యాలీపై అభ్యంతరం

కాంగ్రెస్‌పై అల్లర్ల ఆరోపణలు

రాజీవ్ గాంధీ వ్యాఖ్యల ప్రస్తావన

బాధితుల గాయాలపై ఉప్పు చల్లారంటూ ఆగ్రహం

దీపావళి వ్యాపారాలకు నష్టం ఆరోపణ

రాహుల్ ప్రధాని కలపై సెటైర్లు

మాక్ పార్లమెంట్‌లోనే ఉండాలంటూ వ్యాఖ్యలు



2 లో

న్యూస్ డెస్క్, 01 నవంబర్ (ఇది కద నిజం): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా విరుచుకుపడ్డారు. 1984 నవంబర్ 1 సిక్కుల వ్యతిరేక అల్లర్లు జరిగిన రోజే కాంగ్రెస్ రామ్‌లీలా మైదాన్ ర్యాలీ చేపట్టడాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమం ద్వారా సిక్కుల మనోభావాలను ప్రతిపక్షాలు దెబ్బతీశాయని అన్నారు. అల్లర్ల బాధితుల గాయాలపై ఉప్పు చల్లినట్లు అభివర్ణించారు.చండీగఢ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడుతూ.. 1984 నవంబర్ 1న జరిగిన హింసలో వేలాది మంది సిక్కులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. ఈ అల్లర్లను కాంగ్రెస్ ప్రేరేపించిందని ఆయన విమర్శించారు. వేలాది మందిని సజీవ దహనం చేశారని, అనేక కుటుంబాలు ఇళ్లను విడిచి వెళ్లాల్సి వచ్చిందని, పిల్లలు అనాథలుగా, మహిళలు వితంతువులుగా మారారని పేర్కొన్నారు.

పంజాబ్‌లో ఆప్‌కు రాజకీయ దెబ్బ!

ఎమ్మెల్యే పదవులకు రాజీనామా

40 మందితో ఆప్ తొలి జాబితా

జాబితా ప్రకటన మరుసటి రోజే రాజీనామాలు

పార్టీ నాయకత్వంపై పఠాన్ మజ్రా అసంతృప్తి

జోరా మజ్రాకు ప్రాధాన్యం తగ్గిందా?

ఆప్‌లో పెరుగుతున్న అసమ్మతి

2 లో

మావోయిస్టులు మళ్లీ పుడతారు: జగన్!

పోలింగ్ విధానంపై జగన్ తీవ్ర ఆగ్రహం

పోలీసుల తీరుపై ప్రజాస్వామ్య హనన ఆరోపణలు

70 బూతుల్లో ఏజెంట్లు లేరని విమర్శ

ఉదయం నుంచే బూత్‌ల ఆక్రమణ ఆరోపణలు

ఓటర్లను వెనక్కి పంపుతున్నారని మండిపాటు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదని ఆక్షేపణ

ఎన్నికల కమిషన్ తక్షణ జోక్యానికి డిమాండ్

కాక్రోచ్‌లు, మావోయిస్టులపై సంచలన వ్యాఖ్యలు

2 లో

హైదరాబాద్‌లో గ్రీన్ ట్యాంకర్లు!



2 లో

న్యూస్ డెస్క్, 01 నవంబర్ (ఇది కద నిజం): హైదరాబాద్‌లో గ్రీన్ వాటర్ ట్యాంకర్ సేవలు ప్రారంభం అయ్యాయి. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటిని పొదుపుగా వాడుకునేందుకు, శుద్ధి చేసిన నీటిని తాగునీటియేతర అవసరాలకు ఉపయోగించాలని...



'అర్నబ్' పోయింది 'మురసు' వచ్చింది

- బంగాళాఖాతంలో మరో తుపాను ముప్పు
- నవంబర్ 3న ఏపీ తీరం దాటే ఛాన్స్
- 100-120 కి.మీ వేగంతో బలమైన గాలులు
- ఏపీకి భారీ వర్షాల హెచ్చరిక
- తెలంగాణలో నాలుగు రోజుల పాటు వానలు
- రెండు జిల్లాలకు ఎల్లో అలర్ట్
- మహబూబ్‌నగర్ జిల్లాలకు భారీ వర్ష సూచన
- రైతులు, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తం!

న్యూస్ డెస్క్, 01 నవంబర్ (ఇది కద నిజం): బంగాళాఖాతంలో మరో తుపాను ముప్పు పొంచి ఉంది. ఇటీవల 'అర్నబ్' తుపాను ప్రభావం నుంచి పూర్తిగా కోలుకోకముందే ఆంధ్రప్రదేశ్ వైపు మరో తుపాను దూసుకొస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం క్రమంగా బలపడుతూ 'మురసు'గా మారనుంది. ఈ తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణపైనా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నవంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గత 6 గంటల్లో గంటకు సుమారు 23 కిలోమీటర్ల వేగంతో కదులుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది మరింత బలపడి తుపానుగా మారే అవకాశం ఉందని అంచనా వేసింది.

మిగతాది 2 లో..

10 నిమిషాల్లోనే అంతం చేస్తాం



ఇరాన్‌పై ట్రంప్ మరోసారి హెచ్చరిక

10 నిమిషాల్లోనే అంతం చేస్తామంటూ వ్యాఖ్య

అణు కేంద్రాలే లక్ష్యంగా అమెరికా

పికాక్స్ మౌంటైన్‌పై గురి

దాడులకు సిద్ధంగా ఉండాలని గల్ఫ్ దేశాలకు సమాచారం

ప్రతిదాడులకు టార్గెట్ లిస్ట్ సిద్ధం

మధ్యప్రాచ్యంలో మళ్లీ యుద్ధ మేఘాలు

2 లో

సీఎం రేవంత్‌కు కవిత లేఖ!

ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు డిమాండ్

ఓబీసీల కులగణనకు పట్టుబాటు

ఎస్సీ, ఎస్టీల తరహాలో ఓబీసీల నమోదు

జనాభా దామాషా ప్రకారం న్యాయం

ఆదివాసీల మతానికి ప్రత్యేక కాలమ్

అసెంబ్లీలో తీర్మానం చేయాలని సూచన



న్యూస్ డెస్క్, 01 నవంబర్ (ఇది కద నిజం): జనగణనలో ఓబీసీల కులగణన, ఆదివాసీల మతాన్ని ప్రత్యేకంగా నమోదు చేయడం కోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. డిసెంబర్ ఇంటింటి జనగణన ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వెంటనే అసెంబ్లీ, కౌన్సిల్ స్పెషల్ సెషన్ నిర్వహించాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా ఓబీసీలకు వారి జనాభా దామాషా ప్రకారం అందాల్సిన ఫలాలు అందడం లేదని..

2 లో

'నా వానర సైన్యంతో గర్జిస్తా మోడీ తలవంచక తప్పదు'

మోడీపై రేవంత్ ఫైర్

కాంగ్రెస్ శ్రేణులే వానర సైన్యం

400 సీట్లు రాక కక్ష

13 కోట్ల ఓట్లు తొలగింపు?

20 కోట్లకు చేరే అవకాశం

రైళ్ల కేటాయింపుపై విమర్శలు

ఢిల్లీకి చేరిన కాంగ్రెస్ శ్రేణులు



2 లో

న్యూస్ డెస్క్, 01 నవంబర్ (ఇది కద నిజం): నాడు రావణుడిని ఓడించేందుకు రాముడికి వానర సైన్యం ఏ విధంగా అండగా నిలిచిందో.. నేడు మోడీ అనే రావణుడిని ఓడించేందుకు తెలంగాణ నుంచి ఢిల్లీకి కాంగ్రెస్ వానర సైన్యం కదం తొక్కిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల సంకల్పం ముందు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తలవంచక తప్పదని, విజయం సాధించే వరకు విశ్రమించబోమని

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సోమవారం 02-11-2026

ఓటింగ్ ముగిసింది.. ఫలితాలపై ఉత్కంఠ!



న్యూస్ డెస్క్, 01 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఆదివారం ఉదయం 7:00 గంటలకు ప్రారంభమైన ఎన్నికల పోలింగ్ సాయంత్రం 5:00 గంటలకు ముగిసింది. ఉదయం వేళల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలివచ్చి ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకోగా, మధ్యాహ్న సమయానికి పోలింగ్ కాస్త మందకొడిగా సాగింది. పులివెందుల వంటి కొన్ని సున్నితమైన ప్రాంతాల్లో చెదురుమదురు వివాదాలు, తోపులాటలు చోటు చేసుకున్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసేందుకు ఎన్నికల అధికారులు అవకాశం కల్పించారు. ప్రస్తుతం క్యూలలో ఉన్నవారు ఓటు వేస్తుండటంతో తుది పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశముంది.

ఇదిలా ఉంటే మధ్యాహ్నం 3 గంటల సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా సగటున 48.03 శాతం పోలింగ్ నమోదైంది. ప్రాంతాల వారీగా పరిశీలిస్తే.. కర్నూలు జిల్లా గూడూరు నగర పంచాయతీ ఏకంగా 73.96 శాతం పోలింగ్‌తో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో ప్రకాశం జిల్లా చీమకుర్తి (73.64%), మార్కాపురం జిల్లా కనిగిరి (73.20%), చిత్తూరు జిల్లా నగరి (71.78%), కడప జిల్లా బద్వేలు మున్సిపాలిటీల్లో (71.52%) భారీ పోలింగ్ రికార్డైంది. మరోవైపు మహానగరాల్లో ఓటర్ల నుంచి ఆశించిన స్పందన లభించకపోవడంతో విశాఖపట్నం జీవీఎంసీ పరిధిలో కేవలం 39.72 శాతం మాత్రమే ఓట్లు పోలై రాష్ట్రంలోనే అత్యల్ప పోలింగ్ నమోదైన నగరంగా మిగిలింది. పోలింగ్ ముగియడంతో బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత నడుమ స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలిస్తున్నారు. అవసరమైన చోట్ల సోమవారం రీపోలింగ్ నిర్వహించి, మంగళవారం (నవంబర్ 3న) ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

మావోయిస్టులు మళ్లీ పుడతారు: జగన్!



న్యూస్ డెస్క్, 01 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ విధానంపై వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో పోలీసులు దగ్గరుండి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. అందుకు పులివెందులలో జరుగుతున్న ఘోరమైన ఘటనలే ప్రత్యక్ష నిదర్శనమని మండిపడ్డారు. పులివెందులలో మొత్తం 80 పోలింగ్ బూతులు ఉంటే, అందులో 70 బూతుల్లో వైఎస్సార్ సీపీ ఏజెంట్లు లేకుండా చేశారని ధ్వజమెత్తారు. ఉదయం 4 గంటల నుంచే టీడీపీ నాయకులు, కార్యకర్తలు పోలింగ్ బూత్‌లను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఓటు వేయడానికి వస్తున్న ఓటర్ల స్లిప్లను లాగేసుకుంటున్నారని, ఓటర్లను పోలీసులు దగ్గరుండి వెనక్కి పంపుతున్నారని మండిపడ్డారు. అధికార పార్టీకి పోలీసులు పూర్తిగా సహకరిస్తున్నారని, అసలు ఇది ప్రజాస్వామ్యమేనా అని ప్రశ్నించారు. కళ్లముందే దారుణంగా అక్రమాలు జరుగుతుంటే అధికారులు ఎన్నికలను ఎలా నిర్వహిస్తారని జగన్ నిలదీశారు. కనీసం బూత్‌లలో పారదర్శకత కోసం సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయలేదని ఆక్షేపించారు.

కాక్రోచ్‌లు, మావోయిస్టులు పుడుతున్నారు..

సమాజంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు కూలిపోయి. న్యాయం జరగనప్పుడే అసంతృప్తి తీవ్రమవుతుందని వ్యాఖ్యానించిన జగన్, 'ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినప్పుడే కాక్రోచ్‌లు, మావోయిస్టులు లాంటి పరిణామాలు పుట్టుకొస్తాయి' అని వ్యాఖ్యానించారు. పులివెందులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న ఎన్నికల సరళిని నిరసిస్తూ, తక్షణమే ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

'నా వానర సైన్యంతో గర్జిస్తా మోడీ తలవంచక తప్పదు'

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ కార్యకర్తల దీక్ష ముందు మోడీ గద్దె దిగక తప్పదన్నారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి నిర్వహించిన 'ఓటు బచావో.. దేశ్ బచావో' నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ర్యాలీకి బయలుదేరే ముందు తెలంగాణ భవన్ వద్ద పార్టీ శ్రేణులను ఉద్దేశించి రేవంత్ రెడ్డి మాట్లాడారు.

400 సీట్లు అడ్డుకున్నారని కక్ష:

2024 ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి రిజర్వేషన్లు తొలగించాలని బీజేపీ కుట్ర చేసిందని ఈ కుతంత్రాన్ని పసిగట్టి అన్ని స్థానాలను రాకుండా అడ్డుకున్నారనే కక్షతోని దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనార్టీలు, మహిళలపై ప్రధాని మోడీ కక్ష పెంచుకున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించి ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 13 కోట్లకు పైగా ఓట్లు తొలగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య 20 కోట్లకు చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశ ఓటర్ల జాబితాలో 15 నుంచి 20 శాతం ఓట్లను తొలగించి బీజేపీ మరోసారి అధికారంలోకి రావాలని కుట్ర చేస్తోందని విమర్శించారు.

రాకుండా అడ్డుకోలేకపోయారు:

ఢిల్లీ నిరసన ర్యాలీకి కార్యకర్తలు తరలివచ్చేందుకు చివరి నిమిషం వరకు రైళ్లు కేటాయిస్తామని ఆశలు కల్పించి, చివరకు రైళ్లు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. నరేంద్ర మోడీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ ముగ్గురూ కలిసి ప్రయత్నించినా రైళ్లు ఇవ్వకుండా ఆపగలిగారు కానీ ఢిల్లీకి చేరుకోకుండా తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలు సంకల్పాన్ని అడ్డుకోలేకపోయారని అన్నారు. వేలాది మంది కార్యకర్తలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఢిల్లీకి చేరుకున్నారని తెలిపారు. తెలంగాణ గళం, బలం ముందు ఈ ముగ్గురు తలవంచక తప్పదని అన్నారు. ప్రధాని మోడీ తన అధికారాన్ని కాపాడుకునేందుకు కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో ప్రజలను విభజిస్తున్నారని విమర్శించారు.

సీఎం రేవంత్‌కు కవిత లేఖ!

మొదటి పేజీ తరువాయి

దేశవ్యాప్తంగా ఓబీసీలు ఎంతా జనాభా ఉన్నారనేదానికి చట్టపరమైన లెకక్లు లేకపోవడమే ఇందుకు కారణం అని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ఓబీసీలకు.. ఓబీసీల ఆందోళనను ప్రతి రాజకీయ పార్టీ పరిగణలోకి తీసుకుని వారికి మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. జనగణనలో కులం నమోదుకు ప్రత్యేక కాలం ఏర్పాటు చేసిన వారు ఏ ఓబీసీలు అని చెప్పేందుకు ప్రత్యేకంగా కాలమ్ లేదని ఫలితాంగా వారు ఇతర కులాల జాబితాలో చేర్చాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల జనాభా నమోదు చేసినట్టుగానే ఓబీసీల జనాభాను ప్రత్యేకంగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ ను ప్రత్యేకంగా సమావేశపరిచి తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని సూచించారు.

ఆదివాసీల మతం ప్రత్యేకంగా నమోదు చేయాలి: ప్రత్యేక జీవన విధానం ఉన్న ఆదివాసీల మతాన్ని గతంలో నిర్వహించిన జనగణనలో ప్రత్యేకంగా నమోదు చేశారని.. ప్రస్తుత జనగణనలోనూ ఆదివాసీల మతాన్ని ప్రత్యేకంగా నమోదు చేయాలని కవిత కోరారు. ప్రస్తుత జనగణనలో ఆదివాసీల మతాన్ని ప్రత్యేకంగా నమోదు చేసే అవకాశం లేకుండా చేశారని దీనిపై వారు ఆదోళనలో ఉన్నారని ఈ నేపథ్యంలో అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో జనగణనలో ఆదివాసీల మతాన్ని ప్రత్యేకంగా నమోదు చేయాలని కోరుతూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. దేశ మూలవాసులైన ఆదివాసీల జీవన విధానం అత్యంత ప్రత్యేకమైనదని ప్రకృతిని, అడవిని తమ వేల్పుగా పూజించడం ఆదివాసీల ప్రత్యేకత అని పేర్కొన్నారు.

మోడీ గెలుపు అక్రమమే: రాహుల్ గాంధీ!

మొదటి పేజీ తరువాయి

ఇది తాను స్వయంగా చెబుతున్న మాట కాదని, ఎన్నికల సంఘం విడుదల చేసిన గణాంకాలే ఈ నిజాన్ని బయటపెడుతున్నాయని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశంలో ఎన్నో ఏళ్లుగా వ్యవస్థాగతంగా 'ఓట్ల చోరీ' దందా నిరాటంకంగా కొనసాగుతోందని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. మధ్యప్రదేశ్, హర్యానా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ భారీ స్థాయిలో ఓట్ల చోరీకి పాల్పడ్డారని ఆయన విమర్శించారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌తో పాటు, ఓటర్ల జాబితాలలో ఏకపక్షంగా పేర్లను తొలగించడం, అనర్హుల పేర్లను దొంగచాటుగా చేర్చడం ద్వారానే అధికార పక్షం ఎన్నికల్లో గెలుపొందుతోందని ఆయన దుయ్యబట్టారు.

రాజ్యాంగబద్ధమైన పౌరుల ఓటు హక్కును కాలరాసే విధంగా సాగుతున్న ఈ పరిణామాలను చూస్తూ ఊరుకోబోమని, ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత వచ్చే వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్త పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. అలాగే ఇది ఒక రాజకీయ పార్టీ సభ కాదని, ఈ సభకు లక్షలాది మంది తరలిచ్చి.. ప్రధాని మోడీకి ఒక సందేశాన్ని పంపించారు. ఇది దేశ యువత వాయిస్. పాలకులు ప్రజాస్వామ్యం కంటే పెద్దవాళ్లు కాదని, త్వరలోనే జ్ఞానేష్ కుమార్ పదవి నుంచి తొలగిపోతారని, జ్ఞానేష్ లేకుండా మోడీ మరోసారి ప్రధాని కాలేరని, దేశం మొత్తం అధాని చేతుల్లోకి వెళ్లి పోయిందంటూ రాహుల్ గాంధీ తీవ్రస్థాయి విమర్శలు చేశారు.

జ్ఞానేష్ కుమార్ తొలగింపు తర్వాత మోడీ పని పడతాం

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ త్వరలోనే తన పదవి నుంచి వైదొలగడం ఖాయమని, ఆయన తొలగింపు తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ పని పడతామని రాహుల్ గాంధీ ఘాటుగా హెచ్చరించారు. బీజేపీ వర్గాలు ప్రధాని మోడీ అధికారాన్ని ఎవరూ కదల్చలేరని ప్రచారం చేసుకుంటున్నాయని, అయితే జ్ఞానేష్ కుమార్ వంటి అధికారుల అండదండలు, ఓట్ల దొంగతనం లేకుండా మోడీ మరోసారి ఎన్నికల్లో గెలవడం అసాధ్యమని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న పాలకులను తాము ఎక్కడికీ వెళ్లనివ్వబోమని, ప్రజాక్షేత్రంలో వారిని నిలదీసి తీరుతామని తేల్చిచెప్పారు. దేశాన్ని మతం పేరుతో విభజించి పాలించే రాజకీయాలు తమకు వద్దని, గాంధీ మార్గంలో అహింసా సిద్ధాంతంతో రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశాన్ని సరైన దిశలో నడిపించేందుకు తాము నిరంతరం పోరాడతామని స్పష్టం చేశారు.

ప్రతిపక్షాల ర్యాలీని విఫలం చేసేందుకు బీజేపీ నేతలు విశ్వప్రయత్నాలు చేసినా దేశ యువత వాటన్నింటినీ ఏమాత్రం పట్టించుకోలేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. యువత పెద్ద ఎత్తున, లక్షలాదిగా తరలివచ్చి 'ఇండియా' కూటమికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని హర్షం వ్యక్తం చేశారు. రాంలీలా మైదానానికి పోటెత్తిన ఈ ప్రజా స్ఫూర్తితోనే రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం అంతా కలిసి చివరిదాకా సమష్టిగా పోరాడతామని పిలుపునిచ్చారు. పౌరుల ప్రాథమిక ఓటు హక్కును హరించే కుట్రలను ప్రజలే స్వయంగా తిప్పికొడతారని, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడే ఉద్యమంలో తాము ఎట్టిపరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

"మీరు అక్కడే ప్రధానిగా ఉండండి"

మొదటి పేజీ తరువాయి

అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన వ్యాఖ్యల్ని కూడా అమిత్ షా ప్రస్తావించారు. "పెద్ద చెట్లు కూలినప్పుడు భూమి కంపిస్తుంది"అని రాజీవ్ గాంధీ సిక్కుల ఊచకోతను తక్కువ చేసి మాట్లాడినట్లు అమిత్ షా వెల్లడించారు. 1984 అల్లర్ల బాధితుల పట్ల సున్నితత్వం లేకుండా కాంగ్రెస్ ర్యాలీ నిర్వహిస్తోందని అమిత్ షా ఆరోపించారు. నవంబర్ 1,2,3 తేదీల్లో కార్యక్రమాలు నిర్వహించవద్దని బీజేపీ కాంగ్రెస్‌ను కోరినట్లు ఆయన చెప్పారు.

విదేశాల నుంచి వచ్చే ఆదేశాల మేరకు నవంబర్ 1 ర్యాలీ నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించిందని అమిత్ షా ఆరోపించారు. దీపావళి వ్యాపారాలు దెబ్బతీస్తున్నారని ఢిల్లీ వ్యాపారులు జ్ఞప్తిని కూడా ఇండియా కూటమి పట్టించుకోలేదని అమిత్ షా విమర్శించారు. పండుగకు ముందు మూడు నుంచి నాలుగు రోజుల వ్యవధిలో ఢిల్లీలో సుమారు రూ.25,000 కోట్ల వ్యాపారం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల్లో రాహుల్ వరస పరాజయాలను ప్రస్తావిస్తూ.. ఆయనను ప్రధానిగా చూడాలని తల్లి సోనియా ఆకాంక్షిస్తున్నారని, ప్రతిపక్షాలు కొత్త రాజకీయ వ్యూహాన్ని అనుసరిస్తున్నాయని, మాక్ పార్లమెంట్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని విమర్శించారు."రాహుల్ జీ.. మీరు ప్రధానమంత్రి కావాలనుకుంటే జీవితాంతం మాక్ పార్లమెంట్‌లోనే ఉండిపోండి. ఎందుకంటే మీ వంతు ఎప్పటికీ రాదు" అని షా సెటైర్లు వేశారు.

హైదరాబాద్‌లో గ్రీన్ ట్యాంకర్లు!

మొదటి పేజీ తరువాయి

పరిశ్రమలు, నిర్మాణ సంస్థలు మరియు ప్రభుత్వశాఖలకు సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలోనే 19 మురుగునీటి శుద్ధి కర్మాగారాలు గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయనున్నాయి. మొదటి దశలో 28 ట్యాంకర్లను తీసుకువచ్చారు. వీటి ద్వారా సప్లై చేసే నీటిని నిర్మాణరంగం, తోటపని, ల్యాండ్ స్కేపింగ్, పార్కుల నిర్వహణకు ఉపయోగించనున్నారు.

దీనికోసం మరో 100 ట్యాంకర్లకు సైతం వాటర్ బోర్డు ఆమోదం తెలిపినట్టు సమాచారం. ట్యాంకర్ల కోసం ప్రత్యేక బుకింగ్ వ్యవస్థను సైతం తీసుకురానున్నారు. ట్యాంకర్లను జీపీఎస్ ద్వారా ట్రాక్ చేయడం, బుక్ చేసుకోవడంతో పాటు డిజిటల్ చెల్లింపులు జరిపేలా యాప్ ను సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఇక రాష్ట్రంలో ఎన్‌నినో పరిస్థితులపై ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తమైంది. రాబోయే 8నెలలు తీవ్రమైన నీటికొరత ఉంటుందని ఇప్పటికే ప్రకటించింది. దీంతో నగరవాసులకు కొరత లేకుండా నీటిని అందించేలా పలు నిర్ణయాలు చేసింది.

10 నిమిషాల్లోనే అంతం చేస్తాం..

న్యూస్ డెస్క్, 01 నవంబర్ (ఇది కద నిజం): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మళ్లీ సైనిక దాడులు చేసే అవకాశం ఉందంటూ హెచ్చరికలు జారీ చేశారు. తమ దళాలు ఇరాన్ అణు సామర్థ్యాన్ని ఇప్పటికే దెబ్బతీశాయని, ఇంకా మిగిలి ఉన్న ఒకటి లేదా రెండు లక్ష్యాలను కేవలం 10 నిమిషాల్లో అంతం చేయగలమని తెలిపారు. ముఖ్యంగా ఇరాన్ అణు కార్యక్రమానికి కీలకమైన 'పికాక్స్ మౌంటైన్' సైట్‌ను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేశారు. వచ్చే వారంలో జరిగే అమెరికా మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌పై మిలిటరీ చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని గల్ఫ్ దేశాలకు వాషింగ్టన్ వర్గాలు సమాచారం అందించినట్లు తెలుస్తోంది.

మరోవైపు ఇరాన్ సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీ తమ మిలిటరీ కమాండర్లతో కీలక సమావేశం నిర్వహించి, అమెరికా, ఇజ్రాయెల్‌ల నుంచి వచ్చే ఏ రకమైన ముప్పునైనా తక్షణమే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. శత్రువుల స్థావరాలను దెబ్బతీసేందుకు తమ 'టార్గెట్ లిస్ట్'ను సిద్ధం చేయాలని సైన్యాన్ని ఆదేశించారు. కాగా.. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ పూర్వ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించిన తర్వాత జూన్‌లో కుదిరిన శాంతి ఒప్పందం రద్దయింది. తాజాగా ఇరుదేశాల మధ్య మళ్లీ తీవ్ర ఉద్రిక్తతలు వ్యక్తమవుతుండటంతో మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి.

పంజాబ్‌లో ఆప్‌కు రాజకీయ దెబ్బ!



న్యూస్ డెస్క్, 01 నవంబర్ (ఇది కద నిజం): పంజాబ్‌లోని అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు ఇద్దరు ఎమ్మెల్యేలు షాక్ ఇచ్చారు. త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల మొదటి జాబితా ప్రకటన తర్వాత తమ శాసన సభ్యత్వాలకు వారు రాజీనామా చేశారు. సనౌర్ నియోజకవర్గం ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ పఠాన్ మజ్రా, సమానా నియోజకవర్గానికి చెందిన చేతన్ సింగ్ జోరా మజ్రా, పంజాబ్ అసెంబ్లీకి తమ రాజీనామాలను సమర్పించారు. 2027 అసెంబ్లీ ఎన్నికల కోసం 40 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను ఆప్ ప్రకటించిన మరుసటి రోజే ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు రాజీనామా చేయడం అధికార పార్టీలో కొత్త చర్చకు దారితీసింది.

కాగా, వరదల నిర్వహణ, తనపై నమోదైన క్రిమినల్ కేసులు వంటి పలు అంశాలపై ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ పఠాన్ మజ్రా కొంతకాలంగా ఆప్ నాయకత్వాన్ని విభేదిస్తున్నారు. పంజాబ్ మాజీ మంత్రి అయిన మరో ఎమ్మెల్యే చేతన్ సింగ్ జోరా మజ్రా కూడా పార్టీ తీరుపట్ల అసంతృప్తిగా ఉన్నారు.

మరోవైపు ఈ ఏడాది మే నెలలో శిరోమణి అకాలీ దళ్ మాజీ నాయకుడు సుర్జిత్ సింగ్ రాఖ్రా ఆప్‌లో చేరారు. సమానా నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించే కీలక బాధ్యతలను ఆయనకు అప్పగించారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే అయిన జోరా మజ్రాను పక్కనపెట్టే ప్రయత్నంగా రాజకీయ వర్గాల్లో ఇది చర్చనీయాంశమైంది. తాజాగా ఈ ఇద్దరు ఎమ్మెల్యేల రాజీనామాలు ఆప్‌లో పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనంగా కనిపిస్తున్నది.

సామాన్యుడికి ఊరట.. బియ్యం ధరలకు కళ్లెం!



న్యూస్ డెస్క్, 01 నవంబర్ (ఇది కద నిజం): బియ్యం ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యులకు ఊరట కల్పించేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బియ్యం విక్రయాల్లో పారదర్శకత పెంచడంతో పాటు వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు వసూలు చేయకుండా వివిధ రకాల బియ్యానికి గరిష్ట చిల్లర ధరలను (ఎంఆర్‌పీ) ఖరారు చేసింది. పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో చర్చించిన అనంతరం ఈ ధరలను నిర్ణయించారు.

ఏ రకం బియ్యం ధర ఎంతంటే?

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరల ప్రకారం 26 కిలోల బ్యాగ్ ప్యాక్‌లలో విక్రయించే బియ్యం రకాల వారీగా కిలో ధరలు ఇలా ఉన్నాయి.

బియ్యం రకం కిలో గరిష్ట ధర

బీపీటీ / కేఎన్ఎం రూ.66

ఆర్ఎన్ఆర్ / తెలంగాణ సోనా రూ.74

హెచ్ఎంటీ / జేఎస్ఆర్ రూ.79

ప్రతి దుకాణంలో ధరల బ్యానర్ తప్పనిసరి!

వినియోగదారులకు ధరలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక బ్యానర్లను రూపొందించారు. హైదరాబాద్ జిల్లాలోని అన్ని బియ్యం మిల్లులు, హోల్‌సేల్, రిటైల్ విక్రయ కేంద్రాల్లో వీటిని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. వినియోగదారులకు స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో బ్యానర్లు ప్రదర్శించడంతో పాటు, కుడివైపు దిగువన కేటాయించిన స్థలంలో వ్యాపార సంస్థ పేరు నమోదు చేయాలని ఆదేశించారు.

ఎంఆర్‌పీ దాటితే చర్యలు తప్పవు!

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధరల కంటే ఎక్కువకు బియ్యం విక్రయించకూడదని అధికారులు స్పష్టం చేశారు. ధరల అమలును హైదరాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించనున్నారు. నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యాపారుల సహకారం అవసరం

ప్రభుత్వ నిర్ణయానికి రైస్ మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు పూర్తిస్థాయిలో సహకరించాలని హైదరాబాద్ జిల్లా ముఖ్య రేషనింగ్ అధికారి (సీఆర్ఓ) కోరారు. నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయిస్తూ నాణ్యమైన సరుకును వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని సూచించారు.

ధరల నియంత్రణ కాగితాలకే పరిమితం కాకూడదు!

బియ్యం ధరలను ప్రకటించడం మాత్రమే సరిపోదు. క్షేత్రస్థాయిలో వాటి అమలుపై నిరంతర పర్యవేక్షణ అవసరం. ప్రతి దుకాణంలో ధరల బ్యానర్లు ఏర్పాటు చేశారా? వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించాలి. అప్పుడే ప్రభుత్వ నిర్ణయం సామాన్య కుటుంబాలకు నిజమైన ప్రయోజనం చేకూరుస్తుంది. ధరలపై వినియోగదారులకు అవగాహన కల్పించడం, వ్యాపారంలో పారదర్శకత పాటించడం, అధిక ధరల వసూళ్లను అరికట్టడం ద్వారా బియ్యం మార్కెట్‌ను క్రమబద్ధీకరించడమే ఈ నిర్ణయం లక్ష్యంగా కనిపిస్తోంది.

'అర్నబ్' పోయింది 'మురసు' వచ్చింది

మొదటి పేజీ తరువాయి

అనంతరం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడవచ్చని పేర్కొంది. ఈ తుపానుకు 'మురసు' అనే పేరు పెట్టారు. తమిళంలో మురసు అంటే ఢంకా లేదా పెద్ద డప్పు అని అర్థం. ప్రస్తుత అంచనాల ప్రకారం నవంబర్ 3వ తేదీ మంగళవారం ఉదయం నెల్లూరు, నరసాపురం మధ్య దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉంది.

తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. సముద్రం తీవ్ర అలజడిగా ఉండే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు. మురసు తుపాను ప్రభావంతో నవంబర్ 2, 3వ తేదీల్లో దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కూడా పడవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఇప్పటికే అర్నబ్ తుపాను కారణంగా పంటలు, ఆస్తులకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో మరో తుపాను హెచ్చరికలు రైతులు, తీర ప్రాంత ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేసింది. ఇతర ప్రాంతాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తుపాను తీరం దాటే సమయంలో సముద్రంలోకి వెళ్లకుండా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ అధికారులు సూచిస్తున్నారు.

తుఫాన్ ముప్పు.. రెండ్రోజులు బయటకు రావొద్దు.. కలెక్టర్ వార్నింగ్

మురసు తుపాను ప్రభావం తెలంగాణలోనూ కనిపించనుంది. నవంబర్ 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తుపాను కారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని చల్లటి గాలులు వీచే సూచనలు ఉన్నాయి. నవంబర్ 2వ తేదీన ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు పడవచ్చని అధికారులు అంచనా వేశారు. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

ఈ సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవవచ్చని తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. నవంబర్ 3వ తేదీన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వా

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సోమవారం 02-11-2026

బాన్సువాడలో నాటు బాంబుల పేలుడు

- ఆరుగురికి గాయాలు
- హోటల్‌లో నిల్వ ఉంచిన నాటు బాంబులు పేలడంతో కలకలం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో నాటు బాంబులు పేలిన ఘటన కలకలం రేపింది. ఓ హోటల్‌లో పందుల వేట కోసం నిల్వ ఉంచిన నాటు బాంబులు ప్రమాదవశాత్తు పేలినట్లు సమాచారం. భారీ శబ్దంతో ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో ఆరుగురు గాయపడినట్లు తెలుస్తోంది. పేలుడు ధాటికి అక్కడి పరిసరాల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న స్థానికులు గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఘటనకు గల పూర్తి కారణాలు, గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రజాస్వామ్య పరిరక్షణకు మహా పాదయాత్రలో యువత భాగస్వాములు కావాలి: భుగుడాల గోపి



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: ప్రజాస్వామ్యాన్ని రక్షించి, అరాచకవాదాన్ని అంతం చేయాలనే నినాదంతో నవంబర్ 2న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహా పాదయాత్రలో యువత, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు జుక్కల్‌కు చెందిన భుగుడాల గోపి పిలుపునిచ్చారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ పాదయాత్ర మధ్యాహ్నం 3 గంటలకు నిజాం కళాశాల ఎదురుగా ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ప్రారంభమై మోంజాయి మార్కెట్ ఎక్స్ రోడ్స్ వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కాషాయ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని గోపి కోరారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పోరు

- ఢిల్లీకి కామారెడ్డి కాంగ్రెస్ శ్రేణులు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహిస్తున్న 'ఓట్ బచావో -- దేశ్ బచావో' కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రామ్‌లీలా మైదానానికి బయలుదేరారు.

ఓటు హక్కుల పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ప్రజాస్వామ్య మరియు రాజ్యాంగ విలువల కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉద్యమంలో కామారెడ్డి జిల్లా నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో పంటల ఆరబోతకు ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలి

- రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు



ఇది కద నిజం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: రైతులు, ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు రైతులు పండించిన వరి, మొక్కజొన్న, జొన్న తదితర పంటలను ఆరబెట్టుకోవడానికి సరైన స్థలం లేక రహదారులపైనే ఆరబెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవడమే కాకుండా రోడ్డు ప్రమాదాలు జరిగి రైతులు, ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో రైతులు పంటలను ఆరబెట్టుకునేందుకు కనీసం ఐదు ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర సమన్వయకర్త కాట్రోత్ రవీందర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో పంటల ఆరబోతకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, రోడ్డు ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రజల ప్రాణాలను కాపాడవచ్చని ఆయన పేర్కొన్నారు.

యాదగిరిగుట్ట ప్రధానాలయంలో ఘనంగా 'వేద స్వస్తి' మహోత్సవం

ముఖ మండపంలో ఏకకాలంలో వేద మంత్రోచ్ఛారణ చేసిన 550 మంది వేద విద్యార్థులు, గురువులువేద నాదంతో పులకించిన ఆలయ పరిసరాలు






ఇది కద నిజం, యాదాద్రి :ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ విశేషంగా "వేద స్వస్తి" కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో నిర్వహించిన ఈ మహత్తర వేడుకలో సుమారు 550 మంది వేద విద్యార్థులు, వారి గురువులు పాల్గొని ఏకకాలంలో వేద స్వస్తి పలికారు. చతుర్వేదాలైన రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలలోని పవిత్ర మంత్రాలను విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా పఠించారు. శ్రావ్యమైన మంత్రోచ్ఛారణలతో ఆలయ ముఖ మండపం, ప్రాకారాలు మార్మోగాయి. స్వామివారి దర్శనార్థం విచ్చేసిన భక్తులు ఈ దివ్యమైన వేద నాదాన్ని విని పరవశించిపోయారు. లోకకళ్యాణం, సమాజ శ్రేయస్సు, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో దేవస్థాన ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, వేద పండితులు శ్రీనివాస్ శర్మ,మరియు, ఆలయ కార్యనిర్వాహణాధికారి భవాని శంకర్ ఐఏఎస్ గారు, డీఈఓ భాస్కర్ శర్మ, ఆలయ ఏఈఓ సురేందర్ రెడ్డి, ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేద పఠనం పూర్తి చేసుకున్న విద్యార్థులు, గురువులకు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతో నిండు గర్భిణి మృతి

- నార్మల్ డెలివరీ అని నమ్మించి ప్రాణం తీశారు
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- జనసేన నాయకుడు భూమగళ్ళ రామకృష్ణ తీవ్ర ఆగ్రహం





ఇది కద నిజం,షాద్ నగర్: షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి లో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా నిండు గర్భిణి మృతి చెందడం అత్యంత బాధాకరమని జనసేన పార్టీ జిల్లేడు చౌదరిగూడ మండల అధ్యక్షుడు భూమగళ్ళ రామకృష్ణ తీవ్ర దిగ్భ్రాంతి ఆవేదన వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించి ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న డ్యూటీ వైద్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి కచ్చితంగా శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భూమగళ్ళ రామకృష్ణ మాట్లాడుతూ చెరుకుపల్లి గ్రామానికి చెందిన దళిత మహిళ రాధ ప్రసవ వేదనతో షాద్ నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేరారని తెలిపారు. ఆమెకు సాధారణ ప్రసవం అవుతుందని కుటుంబ సభ్యులను నమ్మించిన డ్యూటీ డాక్టర్లు, తగిన సమయానికి సరైన వైద్యం అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. వైద్యుల అజాగ్రత్త వల్లే కడుపులోని బిడ్డతో సహా గర్భిణి ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. ప్రభుత్వ దవాఖానాలు పేద ప్రజలకు నరకకూపాలుగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాధా అనే దళిత గర్భిణి మహిళ మరియు కడుపులోని బిడ్డ మరణానికి కారణమైన కౌందుర్గ్, షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులపై తక్షణమే కేసు నమోదు చేసి, సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని రామకృష్ణ కోరారు. భవిష్యత్తులో ఇలాంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యేపై ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఈ ఘటనపై తక్షణమే స్పందించాలని, ఆసుపత్రిలో అత్యవసర వైద్యులను నియమించడంతో పాటు ఆధునిక చికిత్సా పరికరాలు, మిషన్లను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో మౌలిక వసతులు మెరుగుపరచకపోతే మరియు బాధ్యులైన వైద్యులపై చర్యలు తీసుకోకపోతే జనసేన పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని భూమగళ్ళ రామకృష్ణ హెచ్చరించారు.



స్నేహితుడిపై అభిమానంతో వృద్ధులకు సేవా కార్యక్రమం

ప్రేమ సదనంలో 20 మంది వృద్ధులకు అల్పాహారం, పండ్ల పంపిణీ

జనగామ నవంబర్ 01 (ఇది కద నిజం)

స్నేహితుడిపై ఉన్న అభిమానాన్ని సేవా కార్యక్రమం రూపంలో చాటుకుంటూ పలువురు స్నేహితులు మానవత్వాన్ని చాటుకున్నారు. ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీతారామపురంలోని ప్రేమ సదనం వృద్ధాశ్రమంలో నివసిస్తున్న 20 మంది వృద్ధులకు అల్పాహారం, పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.చిన్నవంగర గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ప్రముఖులు పాకనాటి సునీల్ రెడ్డి--దీపా రెడ్డి దంపతులు (ఆస్ట్రేలియా) పై ఉన్న అభిమానంతో వారి స్నేహితులు శ్రీరామ్ సంజయ్, పాకనాటి రఘువీర్ రెడ్డి, నమస్తే తెలంగాణ రిపోర్టర్ కొండ సతీష్ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వృద్ధులతో స్నేహితులు ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు సునీల్ రెడ్డి దంపతులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు బ్రహ్మచారిని కలిసి ఆశ్రమ నిర్వహణ, వృద్ధులకు అందిస్తున్న సేవల వివరాలను తెలుసుకున్నారు.ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ పెదపూడి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. గత ఏడు నెలలుగా ఫౌండేషన్ సభ్యులు ప్రతి వారం స్వచ్ఛందంగా ముందుకొచ్చి వృద్ధులకు అల్పాహారం, అన్నదానం, పండ్ల పంపిణీతో పాటు అనాథలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. ఫౌండేషన్ సేవలను ఆస్ట్రేలియా వరకు విస్తరించడం అభినందనీయమని పేర్కొన్నారు.స్నేహితుడు సునీల్ రెడ్డిపై అభిమానంతో ఆయన మిత్రులు వృద్ధులకు సేవ చేయడం గొప్ప విషయమని కొనియాడారు. సమాజ సేవ పట్ల సునీల్ రెడ్డి కుటుంబానికి ఉన్న నిబద్ధత అభినందనీయమని, ఆయన తండ్రి సోమనర్సింహ రెడ్డి సైతం గతంలో ఎంతోమందికి సహాయ సహకారాలు అందించారని గుర్తుచేశారు.ఈ సందర్భంగా సునీల్ రెడ్డి, ఆయన స్నేహితులను ఫౌండేషన్ అధ్యక్షులు ప్రత్యేకంగా అభినందించారు.స్నేహానికి సేవను జోడించి వృద్ధుల ముఖాల్లో చిరునవ్వులు నింపిన ఈ కార్యక్రమం పలువురికి ఆదర్శంగా నిలిచింది.



మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం



శేరిలింగంపల్లి, నవంబర్ 01(ఇది కద నిజం) న్యూస్:

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఉమ్మడి మియాపూర్ డివిజన్, చిరంజీవి నగర్‌లోని హారికా టవర్స్ గేటెడ్ కమ్యూనిటీలో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించరు. బి ఆర్ ఎస్ వి విద్యార్థి నాయకులు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో గెలుపొంది విజయ దంక మోగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ వి శేర్లింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ ఇంచార్జ్ వద్దిరాజ్ రాజు నాయకులు గోల్కొండ రవీందర్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సోమవారం 02-11-2026




చిరు క్లాప్‌తో 'ఆర్సి17' షురూ!



టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించిన 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, స్టార్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'ఆర్సి17'. మెగా ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న.. పూజా కార్యక్రమాలు నేడు సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ గ్రాండ్ ఓపెనింగ్ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేసి, స్వయంగా క్లాప్ కొట్టి ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

ఆర్సి17 ప్రయాణం 'మెగా క్లాప్'తో మొదలైందంటూ మేకర్స్ ఓ వీడియోను కూడా షేర్ చేశారు. అయితే ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా అత్యుత్తమ నిర్మాణ విలువలతో తెరకెక్కిస్తున్నాయి. పూజా కార్యక్రమాలు పూర్తి కావడంతో, త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలుకానుంది. అయితే చిత్రంలో రామ్ చరణ్ సరసన నటించే హీరోయిన్ ఎవరనే దానిపై మేకర్స్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయకుండా సస్పెన్స్ మెయింటైన్ చేస్తున్నారు. దీంతో ప్రేక్షకుల్లో భారీ హైప్ క్రియేట్ అయింది.



ఓటీటీలోకి 'ఐ యామ్ గేమ్'!

మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్, కాయదు లోహర్ జంటగా నటించిన తాజా చిత్రం 'ఐ యామ్ గేమ్'. నహాస్ హిదయత్ దర్శకత్వంలో ఒక డిఫరెంట్ ఫాంటసీ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో ఆంటోనీ వర్గీస్, మిస్కిన్, సంయుక్త విశ్వనాథన్, వినయ్ ఫోర్ట్, కథిర్ కీలక పాత్రల్లో నటించారు. భారీ అంచనాల నడుమ అక్టోబర్ 3న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. థియేట్రికల్ రన్ ముగియకముందే, సినిమా విడుదలైన కేవలం నెల రోజుల్లోనే ఈ మూవీ ఓటీటీకి వచ్చేందుకు సిద్ధమైంది. ఈ మేరకు మేకర్స్ అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. 'ఆట మొదలుకాబోతోంది.. ఐ యామ్ గేమ్ నవంబర్ 6న జియో హాట్‌స్టార్ లో స్ట్రీమింగ్ కాబోతుంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషలలో ఇది అందుబాటులోకి రానుంది.. అస్సలు మిస్ అవ్వకండి' అంటూ క్యాప్షన్ జత చేశారు. థియేటర్లలో ఈ సినిమాను చూడలేకపోయిన ప్రేక్షకులు, ఇప్పుడు డిజిటల్ వేదికపై ఐదు భాషల్లో ఈ ఫాంటసీ థ్రిల్లర్‌ను వీక్షించే అవకాశం లభించింది.



'రాకా'లో యాక్షన్ బ్లాస్ట్!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కొత్త ప్రాజెక్ట్ 'రాకా' నుంచి సినీ ప్రియులకు పూనకాలు తెప్పించే క్రేజీ న్యూస్ ఒకటి బయటకు వచ్చింది. ఈ చిత్రంలో థియేటర్లను దద్దరిల్లేలా చేసే ఇంటర్వెల్ బ్లాక్ కోసం మైండ్ బ్లోయింగ్ స్టంట్స్ మేకర్స్ ప్లాన్ చేశారట. సినిమా మొత్తానికే హైలేట్‌గా నిలిచే ఈ హై-ఆక్టేన్ యాక్షన్ ఎపిసోడ్‌ను నవంబర్ ఫస్ట్ వీక్‌లోనే చిత్రీకరించేందుకు టీమ్ రంగం సిద్ధం చేసిందని చెబుతున్నారు.

ఇప్పటివరకు వచ్చిన బన్నీ సినిమాలకు పూర్తి భిన్నంగా, అత్యంత సహజంగా, అదే సమయంలో రా అండ్ ఇంటెన్స్ యాక్షన్ లెవెల్స్ ఉండేలా ఈ ఇంటర్వెల్ ఫైట్‌ను మేకర్స్ డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. తెరపై అల్లు అర్జున్ చేసే స్టంట్స్, బాడీ లాంగ్వేజ్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడం ఖాయం అని చిత్ర బృందానికి సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. భారీ ఎత్తున ప్లాన్ చేసిన ఈ యాక్షన్ సీక్వెన్స్ కోసం టీమ్ ప్రత్యేక సన్నాహాలు పూర్తి చేసుకుందని సమాచారం.

నవంబర్ ఫస్ట్ వీక్ నుంచి ప్రారంభమయ్యే ఈ షెడ్యూల్‌లో బన్నీతో పాటు ప్రముఖ ఫైటర్లు, ముఖ్య తారాగణం పాల్గొనబోతున్నారట. ఇంటర్వెల్ బ్యాంగ్‌తో థియేటర్లలో ఫ్యాన్స్‌కు అసలైన విజువల్ ట్రీట్ ఇచ్చేలా ఈ సీన్‌ను చిత్రీకరించనుండటంతో, ప్రస్తుతం నెట్టింట 'రాకా' యాక్షన్ అప్‌డేట్ విపరీతంగా ట్రెండ్ అవుతోంది.

సైకో కిల్లర్‌తో సూర్య ఆట!

వైవిధ్యమైన కథలతో ఎప్పటికప్పుడు ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చేసే స్టార్ హీరో సూర్య, ఈసారి మరో క్రేజీ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేస్తున్నారు. 'రోమాంచమ్', 'ఆవేశం' వంటి సెన్సేషనల్ హిట్స్‌తో సౌత్‌లో భారీ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న మలయాళ డైరెక్టర్ జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'సీన్'. తాజాగా రిలీజైన ఈ మూవీ ట్రైలర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ట్రైలర్ చూస్తుంటే సూర్య ఇందులో 'ఇన్‌బరాజ్' అనే మోస్ట్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించినట్లు అర్థం అవుతోంది. డిపార్ట్‌మెంట్‌లో ఎవరినీ ఖాతరు చేయని ఒక తిరుగులేని లెజెండ్ కాప్.. కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడే సడన్‌గా ఉద్యోగానికి రాజీనామా చేసి అందరికీ షాకిస్తాడు. ఎందుకు రిజైన్ చేశావంటే.. "నేను రాజకీయాల్లోకి వెళ్తున్నాను" అంటూ కూల్‌గా చెప్పి ఇంట్లో పని కోసం మాయ (నజ్రియా నజీమ్) అనే హెల్పర్‌ను పెట్టుకుని రిలాక్స్ అవ్వడం మొదలుపెడతాడు.

అయితే అదే సమయంలో నగరంలో ఓ సైకో కిల్లర్ ఎంట్రీతో కథ ఒక్కసారిగా మలుపు తిరుగుతుంది. "నాకు సమానుడైన ప్రత్యర్థిని తీసుకురండి" అంటూ ఈశ్వరన్ అనే కిల్లర్ విసిరే సవాల్‌తో.. మాజీ పోలీస్ ఇన్‌బరాజ్ రంగంలోకి దిగక తప్పదు. అయితే సీరియస్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ లా కాకుండా, ఆ సైకో కిల్లర్‌తో సూర్య ఆడే మైండ్ గేమ్స్ నవ్వులు పూయిస్తూనే సీట్ ఎడ్జ్ థ్రిల్‌ను పంచాయని అనిపిస్తుంది. ఎదురుగా బాంబు పట్టుకుని విలన్ బెదిరిస్తుంటే.. "అలెక్సా.. ఏదో ఒక మంచి మూడ్ మ్యూజిక్ ప్లే చెయ్" అంటూ సూర్య చేసే హంగామా ట్రైలర్‌కే హైలైట్‌గా నిలిచింది. "నేను ఒక్క దెబ్బ కొడితే ఒంటిమీద ఒకటిన్నర టన్ను బరువు పడుతుంది" అంటూ చివర్లో ఆయన చెప్పే మాస్ డైలాగ్, తెరపై కనిపించే విజువల్స్ ఫ్యాన్స్‌కు మస్త్ ట్రీట్ ఇస్తాయి. నజ్రియా క్యూట్ యాక్టింగ్, 'ప్రేమలు' ఫేమ్ నస్లెన్ విలన్ రోల్, సుశిన్ శ్యామ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌ను మరో లెవెల్‌కి తీసుకెళ్లాయి. డార్క్ కామెడీకి ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ జోడించి జితు మాధవన్ తెరకెక్కించిన ఈ 'సీన్' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రచ్చ లేపడం ఖాయమని సూర్య ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ట్రైలర్ యూట్యూబ్‌లో దూసుకుపోతోంది.



దిల్ రాజుతో పవన్ మూవీ!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ - టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు కాంబోలో మరో భారీ ప్రాజెక్ట్ తెరకెక్కబోతున్నట్లు ఫిలింనగర్‌లో ఓ క్రేజీ న్యూస్ తెగ చక్కర్లు కొడుతోంది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'వకీల్ సాబ్' బాక్సాఫీస్ వద్ద ఎంతటి విజయం సాధించిందో తెలిసిందే. ఇప్పుడు మరోసారి ఈ కాంబినేషన్ రిపీట్ కానుండటంతో పాటు, ఈసారి ఏకంగా పాన్-ఇండియా రేంజ్‌లో పూర్తిస్థాయి మాస్ యాక్షన్ మూవీని ప్లాన్ చేస్తున్నారనే టాక్ బయటికి రావడంతో అభిమానుల్లో విపరీతంగా అంచనాలు పెంచేస్తోంది

ఈ చిత్రానికి సంబంధించి ఫిల్మ్ ఛాంబర్ వర్గాల నుంచి వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. దిల్ రాజు ఇప్పటికే 'అర్జున' అనే టైటిల్‌ను రిజిస్టర్ చేయించినట్లు చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ ఇమేజ్, ఆయన బాడీ లాంగ్వేజ్‌కు ఈ టైటిల్ పర్ఫెక్ట్‌గా సరిపోతుందని చిత్ర బృందం భావిస్తోందట. మహాభారతంలోని అర్జునుడి లాగే.. ఇందులో హీరో క్యారెక్టర్ కూడా బలమైన లక్ష్యంతో ఉండే ఓ అసాధారణ పోరాట యోధుడిలా కనిపిస్తుందని, అందుకే ఈ పేరును పరిశీలిస్తున్నట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

ప్రస్తుతం దిల్ రాజు బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తో ఓ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా పనులు ముగిసిన వెంటనే పవన్ ప్రాజెక్ట్‌ను సెట్స్‌పైకి తీసుకెళ్లాలనే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించనున్నట్లు వార్తలు వినిపిస్తుండగా, కథకు సంబంధించిన తుది సన్నాహాలు జరుగుతున్నాయని టాక్. అన్ని భాషల ప్రేక్షకులనూ ఆకట్టుకునేలా భారీ బడ్జెట్‌తో ఈ యాక్షన్ డ్రామాను డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. పవన్ ప్రస్తుతం పాలిటిక్స్‌తో బిజీగా ఉండటంతో, ఆయన షెడ్యూల్స్ క్లియర్ అయిన వెంటనే చిత్ర యూనిట్ నుంచి ఈ 'అర్జున' ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఏది ఏమైనా, పవర్ స్టార్‌కి 'అర్జున' అనే టైటిల్ ఖరారైతే మాత్రం థియేటర్లలో రచ్చ మామూలుగా ఉండదని ఫ్యాన్స్ ఇప్పటినుంచే సంబరపడిపోతున్నారు. దీనికి సంబంధించి మేకర్స్ నుంచి అఫిషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.